సాక్షి
జగిత్యాల

గురువారం । 12 । జూన్ । 2025



గిరి ప్రదక్షిణల్లో భక్తులు

మల్యాల మండల కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం, వెల్గటూర్ మండలం కిషన్ రావుపేట శ్రీలక్ష్మీనృసింహస్వామి గిరి ప్రదక్షిణలో భక్తులు పాల్గొన్నారు. -8లో▸



మక్క విత్తనాల సబ్సిడీకి మంగళం

జగిత్యాలఅగ్రికల్చర్: వానాకాలం సీజన్‌లో జిల్లాలో అత్యధికంగా సాగు చేసే మొక్కజొన్న విత్తనాలకు ప్రభుత్వం మంగళం పాడింది. 8లో▸

గరిష్టం/కనిష్టం
35.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురుస్తుంది. మరికొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

లోకల్ కోర్టుల ద్వారా విద్యుత్ సమస్యలు పరిష్కారం



పరిష్కార వేదికలో అధికారులు, వినియోగదారులు

మెట్‌పల్లి: అపరిష్కృతంగా మిగిలిపోయిన విద్యుత్ సమస్యలకు లోకల్ కోర్టుల ద్వారా పరిష్కారం లభిస్తోందని రెండో సీజీఆర్‌ఎఫ్ నిజామాబాద్ లోకల్ కోర్టు చైర్మన్ నారాయణ అన్నారు. మెట్‌పల్లి పట్టణంలో బుధవారం లోకల్ కోర్టు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ సమస్యలపై ఒక్క ఫిర్యాదు కూడా అందలేదని తెలిపిన ఆయన.. విద్యుత్ అధికారులు, సిబ్బంది మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. విద్యుత్ ఆదా కోసం రైతులు కెపాసిటర్లు బిగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సిబ్బంది సెల్‌ఫోన్ నంబర్లను గోడలపై రాయించాలని ఆదేశించారు. సీజీఆర్‌ఎఫ్ మెంబర్ టెక్నికల్ రామకృష్ణ, మెంబర్ ఫైనాన్స్ కిషన్, ఎస్‌ఈ సాలియానాయక్, మెట్‌పల్లి డీఈ గంగారాం, ఏడీఈలు మనోహర్, రఘుపతి, ఏఈలు రవి, ప్రదీప్, శివకుమార్, శ్రీనివాస్, అజయ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కట్ ప్రాంతాలు

జగిత్యాలజోన్: జిల్లాకేంద్రంలోని టౌన్–3 సెక్షన్ పరిధిలో గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్పీడీసీఎల్ డీఈ రాజిరెడ్డి తెలిపారు. గాంధీనగర్ 11 కేవీ విద్యుత్ ఫీడర్‌పై చెట్లకొమ్మలు తొలగించాల్సి ఉందని, తీన్‌ఖీని చౌరస్తా, పెద్ద మసీదు, కటికెవాడ, మంచినీళ్ల బావి, ఇస్లాంపుర, గాంధీనగర్, తెనుగువాడ, దగ్గులమ్మ గుడి, ఉస్మాన్‌పురా, మహబూబ్‌పుర, రహమత్‌పురా, జెండా మహిళా, ప్యారాబాయ్, గోరేమియా, ఖిలాగడ్డ, తులసీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి



నూకపల్లి వైద్య శిబిరంలో డీఎంహెచ్‌ఓ, సిబ్బంది

మల్యాల: ప్రతి ఒక్కరూ తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ సూచించారు. మల్యాల మండలం నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. టీబీ, హెచ్‌ఐవీ, డయాబెటిస్, బీపీ తదితర పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. వర్షాకాలంలో పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ వహించాలన్నారు. చెత్తాచెదారం, మురికినీరు నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, వైద్యులు మౌనిక, సౌజన్య, ఎంఎల్‌హెచ్‌పీ సుష్మిత, ప్రకాశ్, రమేశ్, సాజిద్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సకల సౌకర్యాలు



జగిత్యాలలో టీచర్స్‌తో మాట్లాడుతున్న డీఈవో రాము

జగిత్యాల: పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన వసతులు ఏర్పాటు చేశామని డీఈవో రాము అన్నారు. జగిత్యాలలోని పలు పాఠశాలలను బుధవారం పరిశీలించారు. వాష్‌రూమ్‌లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకున్నామని, తాగునీటి వసతి కల్పించామని తెలిపారు. తొలిరోజే విద్యార్థులకు నోట్‌బుక్‌లు, టెక్ట్స్‌బుక్‌లు ఇస్తామన్నారు. మధ్యాహ్న భోజనంలో ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు గ్రామసభలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ధర్మపురి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని డీఈవో అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని కమలాపూర్, నక్కలపేట పాఠశాలలను సందర్శించారు. వసతులు, సౌకర్యాలు, డిజిటల్ బోధన, ఇంగ్లిష్ విద్యపై పిల్లలు, తల్లిదండ్రులకు వివరించారు. ఎంఈవో సీతామహాలక్ష్మి, ఉపాధ్యాయులు మ్యాన పవన్‌కుమార్, ఆసిఫ్, ప్రీతి, సంపూర్ణ తదితరులున్నారు.

మేం చదివాం.. మీరూ చదవండి

- నాటి మధురజ్ఞాపకాలు మదిలోకి..
- ఆ అనుభూతే వేరంటున్న పాత తరం
- చదువుతోనే భవిష్యత్ అంటున్న ఉన్నతాధికారులు
- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

ఇష్టంతో రండి..

జగిత్యాల: 'పాఠశాలకు తొలిరోజు వెళ్లడమంటే అదో అనుభూతి. మరిచిపోలేని మధురక్షణం. నాన్నగానీ, అమ్మగానీ స్కూల్‌కు తీసుకెళ్తుంటే సహజంగానే కొంత భయం ఉంటుంది. స్కూల్‌కు వెళ్లడం అలవాటు పడిన అనంతరం ఆ మధురజ్ఞాపకాలు మరిచిపోలేం..' అంటున్నారు పాతతరం. ఇష్టంతో వచ్చి.. ఇష్టంగా చదివి.. ప్రయోజకులుగా మారాలని సూచిస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలోని పలువురు ప్రముఖులు 'సాక్షి'తో వారి జ్ఞాపకాలను పంచుకున్నారు. చదువుతోనే భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు.

ఉత్సాహంతో వెళ్లా.. – సత్యప్రసాద్, కలెక్టర్



సెలవు అనంతరం పాఠశాలకు వెళ్లిన మొదటి రోజు ఉత్సాహంగా అనిపించేది. ఎక్కువగా మా అమ్మ నిర్మల స్కూల్‌కు తీసుకెళ్తుండేది. విజయనగరంలో ఒకటో తరగతి నుంచి 4వ తరగతి వరకు.. అనంతరం విశాఖపట్టణంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ మిషనరీ స్కూల్‌లో చదువుకున్నా. తొలిరోజు పాఠశాలకు వెళ్లడం ఎంతో మధుర జ్ఞాపకం. సెలవుల అనంతరం వెళ్తే కొత్తబుక్స్, కొత్త యూనిఫాం, కొత్త క్లాస్ కావడంతో ఆ మధురమైన క్షణాలు ఇప్పటికీ గుర్తుకొస్తుంటాయి. అమ్మ లంచ్ సమయంలో వచ్చి భోజనం తినిపించేది. ఆ ఆనందం వేరు. విద్యతోనే అభివృద్ధి ఉంటుంది. ప్రతి ఒక్కరూ చదువులో రాణించాలి. ఏ ఏడాది ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించాం. నిత్యం పర్యవేక్షణ ఉంటుంది. విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలి.



పైడిమడుగు ఉన్నత పాఠశాల

భయంగా ఉన్నా.. ఆనందమే – జెడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత



స్కూల్‌కు వెళ్తున్న తొలిరోజుల్లో కొద్దిగా భయం ఉనిపించినా.. ఆ ఆనందమే వేరు. కొత్తబుక్స్, డ్రెస్‌లు కొనిస్తారు. నేను జగిత్యాల రూరల్ మండలం గోవులాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుకున్నాను. అమ్మ రాజమణి, నాన్న నారాయణ ప్రతిరోజూ స్కూల్‌లో దింపేవారు. ఇష్టంగానే పాఠశాలకు వెళ్లేదానిని. ఆ రోజులను మరిచిపోలేం. ప్రతిఒక్కరూ స్కూల్‌కు వెళ్లి ఉన్నతస్థాయికి చేరి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలి.

అమ్మమ్మతో వెళ్లేదాన్ని – అడువాల జ్యోతి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్



స్కూల్ చదువును అమ్మమ్మ ఇల్లయిన పెగడపల్లిలో పూర్తి చేశాను. ప్రతిరోజు అమ్మమ్మతోనే స్కూల్‌కు వెళ్లేదాన్ని. ఒకటి నుంచి నాలుగో తరగతి వరకు పెగడపల్లిలో.. తర్వాత ముంబయిలో చదువుకున్నాను. తొలిరోజుల్లో స్కూల్‌కు వెళ్లడమనేది ఒక మధుర అనుభూతి. లోపల భయం ఉన్నప్పటికీ స్కూల్‌కు వెళ్లడం కొత్తగా ఉంటుంది.

నాన్నతో వెళ్లేవాడిని – మధుసూదన్, ఆర్డీవో, జగిత్యాల



నా చదువంతా గంగాధరలో సాగింది. స్కూల్‌కు నాన్న మల్లయ్యనే తీసుకెళ్లేవారు. ఆనందంగా ఉండేది. ఆ ఉత్సాహం వేరేగా ఉంటుంది. ఉపాధ్యాయులు ఎంతో ప్రేమగా చదువు చెప్పేవారు. నాన్ననే రోజూ తీసుకెళ్లేవారు. ఉపాధ్యాయుల చొరవతో ప్రస్తుతం ఈ స్థాయిలో ఉన్నాను. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతోంది. డిజిటల్ బోర్డులు, కంప్యూటర్స్, ల్యాబ్స్ ఎన్నో వచ్చాయి. ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలి. చదువుతోనే భవిష్యత్.

ప్రభుత్వ పాఠశాలలోనే చదువు –సంజయ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే



జగిత్యాలలోని వీక్లీబజార్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి వరకు చదువుకున్నాను. ఉపాధ్యాయులందరూ బాధ్యతగా పాఠాలు చెప్పేవారు. ఆ అనుభూతి వేరు. ప్రతిఒక్కరూ క్రమశిక్షణతో ఉంటే అన్ని రంగాల్లో రాణించవచ్చు. స్కూల్‌లో స్నేహితులతో కలిసి అనేక క్రీడలు ఆడేవాడిని. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య ఉంది. డాక్టర్ అయ్యాను. ప్రజలకు సేవ చేస్తూ ఎమ్మెల్యేగా గెలుపొందాను. ఈ తరం విద్యార్థులు కూడా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలి.

ప్రముఖులను అందించిన పైడిమడుగు ప్రభుత్వ పాఠశాల

కోరుట్ల రూరల్: కోరుట్లలోని పైడిమడుగు ఉన్నత పాఠశాల ఉన్నత విద్యావంతులకు నిలయంగా నిలుస్తోంది. ఇక్కడ చదివిన ఎంతోమంది గ్రూప్–1 అధికారులు, డాక్టర్లు, ఇంజనీర్లు, పోలీస్ అధికారులు అయ్యారు. సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడి పాఠశాల పేరును నిలబెడుతున్నారు. కొందరు పూర్వ విద్యార్థులు 'పైడిమడుగు ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్' ఏర్పాటు చేసి ఏటా ఉచితంగా నోట్‌బుక్స్, బ్యాగులు, బూట్లు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇక్కడ చదివిన జక్కుల శంకరయ్య గ్రూప్–1 అధికారిగా వరంగల్, హైదరాబాద్ నగరపాలక సంస్థలకు కమిషనర్‌గా పని చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని మాదాపూర్ నగరపాలకసంస్థకు కమిషనర్‌గా కొనసాగుతున్నారు. డాక్టర్ ఆడెపు రాజేశం కుష్టువ్యాధి నివారణ సంస్థ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. తురగ శ్రీనివాస్ రెడ్డి ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. రాజ నర్సయ్య సీఐగా ఉన్నారు. పిన్నంశెట్టి శ్రీనివాస్ ఎంఈవోగా ఇటీవలే ఉద్యోగ విరమణ పొందారు. పది మంది ఉపాధ్యాయులు, ఐదుగురు ఆర్మీ ఉద్యోగులు పనిచేస్తున్నారు. కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు కూడా ఇక్కడ చదివిన వారే.

పాఠశాలలో ఎన్నో నేర్చుకున్నం



పైడిమడుగు ఉన్నత పాఠశాలలో 6, 7 తరగతులు చదువుకున్నా. ఆ రెండేళ్లు అనేక జీవిత పాఠాలు నేర్చుకున్నాను. ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థుల పట్ల చూపిన శ్రద్ధ ఇప్పుడు ఎంతోమందిని ఉన్నత స్థానాల్లో నిలిపింది. – కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ ఎమ్మెల్యే, పూర్వ విద్యార్థి

క్రమశిక్షణతోనే ఈ స్థాయికి



పైడిమడుగులో 7వ తరగతి వరకు చదువుకున్నాను. ఉపాధ్యాయులు చిన్ననాటి నుంచే చక్కని క్రమశిక్షణ అలవాటు చేశారు. అదే స్ఫూర్తి, పట్టుదలతో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాను. ఎంతోమందికి విద్య నేర్పే అవకాశం వచ్చింది. మా ఊరు పాఠశాలను ఎప్పటికీ మరిచిపోను. – పిన్నంశెట్టి శ్రీనివాస్, రిటైర్డ్ ఎంఈఓ

సెలవులు అప్పుడే అయిపోయాయా అనిపించేది



సంగెంలో చదువుకునే రోజుల్లో అప్పుడే సెలవులు ముగిశాయా..? అనిపించేది. పాఠశాలలు పునఃప్రారంభమయ్యాక రెండుమూడు రోజులు స్కూల్‌కు వెళ్లాలని అనిపించేది కాదు. తరువాత అలవాటయ్యేది. పైక్లాసుకు వెళ్లి కొత్త పుస్తకాలు, కొత్త డ్రెస్సు వేసుకుని ఉత్సాహంగా స్కూలుకు వెళ్లేవాళ్లం. – సందీప్, కోరుట్ల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, సంగెం గ్రామం

నిజాం కాలం నుంచి..



ఓల్డ్ హైస్కూల్

జగిత్యాల: జిల్లా కేంద్రం నడిబొడ్డున.. నిజాం కాలంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్ హైస్కూల్) ఉమ్మడి జిల్లాలోనే ప్రథమ స్కూల్ అని చరిత్రకారులు చెబుతుంటారు. ఈ స్కూల్‌లో చదువుకున్న ఎంతోమంది గొప్పవారయ్యారు. రెండెకరాల స్థలంలో ఉన్న ఈ స్కూల్ ఇప్పటికీ కొనసాగుతోంది. 6 నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఈ స్కూల్‌లో 350 మంది చదువుకుంటున్నారు. క్రమశిక్షణ గల స్కూల్‌గా పేరుగాంచింది. మాజీమంత్రులు జీవన్‌రెడ్డి, రాజేశంగౌడ్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తండ్రి హన్మంతరావు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎంపీ సంతోష్, డాక్టర్ జగన్నాథరావు వంటి ఎందరో ఈ పాఠశాలలో చదువుకున్నారు.

మంచి విద్య



ఈ పాఠశాలలో మంచి విద్య విద్యార్థులకు అందున్నాం. నిపుణులైన ఉపాధ్యాయులు ఉన్నారు. మంచి ల్యాబ్ విద్యార్థులకు మౌలిక వసతులు కలిగి ఉన్నాయి. పురాతనమైన ఈ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా నేను ఉండటం ఆనందంగా ఉంది. – ఆనందరావు, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు

అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తా..



సన్మాన సభలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి

- అందరి కృషి, ఆశీర్వాదంతోనే మంత్రి పదవి
- సన్మాన సభలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాలటౌన్: కార్యకర్తల కృషి, ఆశీర్వాదంతోనే తనకు మంత్రి పదవి దక్కిందని, అందరిలో ఒకడిలా ఉంటూ అభివృద్ధి చేసి చూపిస్తానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం మొదటిసారి జిల్లాకేంద్రానికి వచ్చిన ఆయనకు మాజీమంత్రి జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. ముందుగా మంత్రి రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సన్మాన సభలో మాట్లాడుతూ పార్టీ కోసం ప్రతిఒక్కరూ నిజాయితీతో పనిచేయాలని సూచించారు. తనను వెన్నుతట్టి ప్రోత్సహించిన జీవన్‌రెడ్డి సహకారంతో ముందుకు సాగుతానని తెలిపారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా.. విప్‌గా లక్ష్మణ్‌కుమార్ సమర్థవంతంగా పనిచేశారని, మంత్రిగా మరిన్ని సేవలు అందించాలని కోరారు. క్రమశిక్షణ గల కార్యకర్తగా ఎదిగి కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. మంత్రి కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, బండ శంకర్, కొత్త మోహన్, తాటిపర్తి విజయలక్ష్మి, గాజంగి నందయ్య, గాజుల రాజేందర్, కల్లెపెల్లి దుర్గయ్య, పుప్పాల అశోక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని మంత్రి తెలిపారు. జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించారు. పురోహితులు మంత్రికి ఆశీర్వచనాలు అందించారు. ఉద్యోగ, కుల సంఘాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రిని సన్మానించారు.

'రోళ్లవాగు' అనుమతికి మరింత సమయం



రోళ్లవాగును పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ సువర్ణ, ఎమ్మెల్యే సంజయ్

సారంగాపూర్: రోళ్లవాగు ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురవుతున్న అటవీభూములకు అటవీశాఖతోపాటు కేంద్రం పర్యావరణ అనుమతి రావాల్సి ఉందని, ఇందుకు సమయం పడుతుందని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) సువర్ణ అన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో కలిసి బీర్‌పూర్ శివారులోని ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టు నిర్మాణంలో అటవీశాఖ భూములు 800ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని ఇంజినీరింగ్, అటవీశాఖ అధికారులు వివరించారు. ప్రాజెక్టు సమీపంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ ఫారెస్ట్ అభయారణ్యం ఉందని, ఇందుకు పర్యావరణ అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. వారి వెంట చీఫ్ కన్జర్వేటర్ శర్వానంద్, డీఎఫ్‌వో రవిప్రసాద్, ఈఈ నారాయణరెడ్డి, డీఈ చక్రూనాయక్ తదితరులు ఉన్నారు.

సువర్ణను కలిసిన కలెక్టర్

జగిత్యాల: రోళ్లవాగు పరిశీలనకు వచ్చిన సువర్ణను జగిత్యాలలోని గెస్ట్‌హౌస్‌లో కలెక్టర్ సత్యప్రసాద్ కలిశారు. ప్రాజెక్ట్ గురించి చర్చించారు.

వార్షిక రుణ ప్రణాళిక ఆవిష్కరణ

జగిత్యాల: జిల్లా వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బ్యాంకింగ్ నాలుగో త్రైమాసిక ప్రగతిపై సమీక్షించారు. లక్ష్య సాధనలో బ్యాంకర్లు ప్రతిఒక్కరూ సహకరించాలని, జిల్లాలో వ్యవసాయ, మహిళ అభివృద్ధి, స్వయం సహాయక సమితులు, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి బ్యాంకింగ్ రంగం కృషి చేస్తోందని, ఇంకా చేయాలని పేర్కొన్నారు. ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ రవీంద్రకుమార్‌సింగ్, వ్యవసాయాధికారి భాస్కర్, మైనార్టీ, హార్టికల్చర్, మత్స్యశాఖ అధికారులు చిత్రు, శ్యామ్, సురేశ్ పాల్గొన్నారు.

దుర్గాదేవికి 108 కలశాలతో అభిషేకం



రాయికల్: పౌర్ణమి సందర్భంగా మండలంలోని మైతాపూర్‌లో దుర్గాదేవికి అర్చకులు జగదీశ్వర్ 108 రకాల కలశాలతో పంచామృతాభిషేకం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బూస గంగమల్లయ్య, శివనీతి అయ్యర్, బేతి రాజిరెడ్డి, కోల కృష్ణారెడ్డి, నాగుల గంగారాం, సతీశ్, రాజు, లింగారెడ్డి, గంగారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



వర్షకొండలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఇబ్రహీంపట్నం: రైతులు భూములు కొన్న వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అడిషనల్ కలెక్టర్ లత అన్నారు. మండలంలోని వర్షకొండ, బర్ధీపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. దరఖాస్తులు ఎలా స్వీకరిస్తున్నారు..? ఎన్ని వచ్చాయి..? పరిశీలించారు. భూములు కొన్నవారు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వెనకడుగు వేయొద్దన్నారు. రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టా లేకుంటే పాత రికార్డులు పరిశీలించి.. పొరుగు ఉన్న రైతు వాగ్మూలంతో పట్టా చేస్తామన్నారు. విరాసత్ 30 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. వ్యవసాయ భూమిలో ఇళ్లు, బడి అని రికార్డుల్లో పడిన రైతులు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి వ్యవసాయ భూమిగా నమోదు చేస్తామన్నారు. ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ వరప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఆర్‌ఐలు రేవంత్‌రెడ్డి, రమేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మెట్‌పల్లి: పట్టణంలోని 8,19వ వార్డుల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను అడిషనల్ కలెక్టర్ లత పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించవద్దని సూచించారు. కమిషనర్ మోహన్, డీఈ నాగేశ్వర్‌రావు, ఏఈ తిరుపతి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రత్నాకర్ ఉన్నారు.

ఆపిల్ బేర్ సాగు.. లాభాలు బాగు

- ప్రత్యామ్నాయ పంటల వైపు అన్నదాతల చూపు
- తోటి రైతులకు ఆదర్శం..



లక్ష్మీదేవిపల్లిలో సాగుచేసిన గంగనేరడి తోట

సారంగాపూర్: జిల్లా వ్యవసాయ ఆధారితం. సాగునీటి సౌకర్యం ఉండడంతో ఇక్కడి రైతులు ఎక్కువగా వరి పండిస్తుంటారు. తర్వాతి స్థానంలో మొక్కజొన్న, పత్తి వంటివి ఉన్నాయి. కొన్నాళ్లుగా రైతులు పంట మార్పిడి వైపు దృష్టి సారిస్తున్నారు. తమకున్న పొలంలో కొద్దిపాటి విస్తీర్ణంలో గంగనేరడి (ఆపిల్‌బేర్) పళ్ల సాగు చేపడుతున్నారు. ఈ పంటను ఐదు, పది గుంటల్లో సాగుచేసినా ఊహించని లాభాలు వస్తుండడంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. కాశ్మీర్ ఆపిల్‌గా పిలిచే ఈ గంగనేరడి పండులో అధిక పోషకాలు ఉంటాయంటున్నారు వ్యవసాయ అధికారులు. ఎక్కువ కేలరీలు ఉన్నా.. ఫ్యాట్ అతితక్కువగా ఉండి కార్బొహైడ్రేట్లు, ఫైబర్, ప్రోటీన్లు, పోటాషియం, మెగ్నీషియం, కాల్షియం, భాస్వరం, విటమిన్ కే వంటివి పుష్కలంగా ఉంటాయంటున్నారు శాస్త్రవేత్తలు.


20 ఎకరాల్లో సాగు

సారంగాపూర్ మండలంలో ఇప్పటికే 20 ఎకరాల్లో ఆపిల్‌బేర్ సాగుచేస్తున్నారు. మరింత మంది రైతులు సాగు చేయడానికి ముందుకొస్తున్నారు. ముఖ్యంగా లక్ష్మీదేవిపల్లిలో ఎక్కువ మంది సాగు చేస్తున్నారు. దీనికి ఉపాధి హామీ కింద ప్రోత్సాహం అందుతుండడంతో రైతులు ముందుకొస్తున్నారు. మొక్క ఖరీదు, గుంత తీయడం, నాటడం, మూడేళ్ల వరకు నిర్వహణ ఖర్చులు రైతులకు అందుతున్నాయి. మొక్కలను ఖమ్మం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూర్ నుంచి తెప్పిస్తున్నారు. ఎనిమిది నెలల్లో మొదటి పంట చేతికి వస్తుంది. మొదటి ఏడాది 5 నుంచి 10 కిలోలు దిగుబడి ఇస్తుందని, మూడో సంవత్సరం వరకు 50 కిలోల నుంచి 70 కిలోల పంట చేతికొస్తుందని రైతులు అంటున్నారు. మూడో ఏడాది నుంచి ఎకరాకు రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు ఆదాయం వస్తుందంటున్నారు.

ప్రూనింగ్ తప్పనిసరి

ఆపిల్‌బేర్ పంట కాలం ముగిసిన వెంటనే మే, జూన్‌లో కొమ్మలను కత్తిరించాలని, తద్వారా కొత్తగా ఆకులు, కొమ్మలు వచ్చి దిగుబడి ఎక్కువగా వస్తుందని రైతులు చెబుతున్నారు.


రైతుల్లో సాగు విధానం మారాలి



రైతులు వరి సాగునే ప్రధానంగా ఎంచుకుంటున్నారు. ఆపిల్‌బేర్ సాగును కొన్ని గుంటల్లో సాగుచేస్తే లాభాలు ఎక్కువగా వస్తాయి. మొక్కలను నాటిన మొదటి ఏడాది నుంచే కాత మొదలవుతుంది. ఈ విషయాన్ని రైతులు తెలుసుకోవాలి.

– భ్యా ప్రభాకర్, లక్ష్మీదేవిపల్లి

సాగు చేసే రైతులకు ప్రోత్సాహం



ఆపిల్‌బేర్ పంట సాగుచేయాలనుకునే రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నాం. మొక్కలను ఖమ్మం, గుంటూర్ నుంచి తెప్పిస్తున్నాం. వివరాలకు పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలి.

– గంగాధర్, ఎంపీడీవో

క్లుప్తంగా

పోషణతో కూడిన విద్య అందించడమే లక్ష్యం



దొంతాపూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ధర్మపురి: అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణతో కూడిన విద్య అందించడమే లక్ష్యమని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. అమ్మమాట – అంగన్‌వాడీబాటలో భాగంగా మండలంలోని దొంతాపూర్‌లో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మూడు నుంచి ఆరేళ్ల పిల్లల నమోదు, ప్రీస్కూల్ హాజరు పెంచడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఆటపాటలతో విద్యనందించనున్నట్లు వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించి వసతులు కల్పించేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆర్డీవో మధుసూదన్, జిల్లా సంక్షేమాధికారి నరేశ్, సిడిపివో వాణిశ్రీ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లున్నారు.

ఆరోగ్య తెలంగాణ లక్ష్యం



భూమిపూజ చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి: ఆరోగ్య తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. భీమారం మండలకేంద్రంలో రూ.1.43 కోట్లతో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. 97 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, 27మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. మేడిపల్లి మండలం వల్లంపల్లిలో కాకతీయ కెనాల్‌పై రూ.2.50కోట్లతో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించారు. భీమారం మండల ప్రజల చిరకాల కోరిక నెరవేరబోతోందని, ప్రజల కోరిక మేరకు వారు సూచించిన ప్రదేశంలోనే ఆసుపత్రి నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, చేపూరి నాగరాజు, బద్దం రాజేందర్ రెడ్డి, నీరటి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

భూవివాదంలో ఒకరి ఆత్మహత్యాయత్నం

మెట్‌పల్లిరూరల్: తాను కొనుగోలు చేసిన భూమిని ఇతరులకు విక్రయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మెట్‌పల్లి మండలం చౌలమద్దిలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. కోరుట్లకు చెందిన వనతడుపుల నాగేశ్వరవరప్రసాద్ కొన్నేళ్ల క్రితం చౌలమద్ది శివారులోగల భూమి కొన్నాడు. డబ్బులు చెల్లించినా.. ఆ భూమిని ఓ కుల సంఘం పెద్దమనుషులు తనకు కాకుండా ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయించారు. తన డబ్బులు తనకు ఇవ్వాలని అడిగినా ఇవ్వకపోవడంతో విసుగు చెందిన నాగేశ్వరవరప్రసాద్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు అతడిని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి వద్ద ఓ నోట్ లభ్యమైంది. మెట్‌పల్లి సీఐ అనిల్, ఎస్సై కిరణ్‌కుమార్ బాధితుడి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఘటనపై ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.





గిరి ప్రదక్షిణల్లో భక్తులు

మల్యాల/వెల్గటూర్: మల్యాల మండలం ముత్యంపేటలోని కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం, వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేట శ్రీలక్ష్మీనృసింహస్వామి గిరి ప్రదక్షిణలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. కొండగట్టులో ఘాట్‌రోడ్డు నుంచి సుమారు ఏడు కిలోమీటర్ల మేర భక్తులు జై శ్రీరాం, జై హనుమాన్ నినాదాలతో ప్రదక్షిణ చేపట్టారు. కిషన్‌రావుపేటలో స్వామివారి శావ మోస్తూ ప్రదక్షిణ చేశారు.

మక్క విత్తనాల సబ్సిడీకి మంగళం

- ఓపెన్ మార్కెట్లోనే హైబ్రిడ్ విత్తనాల కొనుగోలు
- కంపెనీలను బట్టి 4 కిలోల బస్తాకు రూ.1500 నుంచి రూ.2500 వరకు
- సబ్సిడీ లేక జిల్లా రైతులకు రూ.4కోట్ల మేర నష్టం



మొక్కజొన్న పంట

జగిత్యాలఅగ్రికల్చర్: వానాకాలం సీజన్‌లో జిల్లాలో అత్యధికంగా సాగు చేసే మొక్కజొన్న విత్తనాలకు ప్రభుత్వం మంగళం పాడింది. వరి విత్తనాల మాదిరిగా రైతులు తమ పంట నుండి వచ్చే మొక్కజొన్న విత్తనాలు వాడుకుంటే దిగుబడులు రావు. దీంతో మక్క సాగు చేసే రైతులు ప్రైవేట్ కంపెనీల హైబ్రిడ్ విత్తనాలపైనే ఆధారపడుతున్నారు. దీంతో ఆయా కంపెనీలు చెప్పిన ధరకు రైతులు ఓపెన్ మార్కెట్లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. పంటలోమూడు నెలల తర్వాత వచ్చే దిగుబడి ఏమోగాని, విత్తనాల ఖర్చే తడిసి మోపెడవుతోంది. మొక్కజొన్నలపై కనీసం 33శాతం సబ్సిడీ లేక రైతులపై దాదాపురూ.4కోట్లఅదనపుభారంపడుతోంది.

వైఎస్సార్ హయాంలో 33 శాతం సబ్సిడీ

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో ప్రైవేట్ కంపెనీలు విత్తనాలపై 33 శాతం సబ్సిడీ ఇచ్చేది. దీంతో రైతులు తమకు నచ్చిన కంపెనీ విత్తనాలు కొనుగోలు చేసి సబ్సిడీ పొందేవారు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో సబ్సిడీ రద్దు అయ్యింది. దీనివల్ల జిల్లా రైతులపై అధిక భారం పడనుంది. జిల్లా మొత్తంగా దాదాపు 60 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తారు. రైతులు ఎకరాకు 4 కిలోల విత్తనాలు వాడుతారు. దీన్ని బట్టి జిల్లాకు 2.40 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం.

4 కిలోల బస్తాకే రూ.1500 నుంచి రూ.2500

రైతుల డిమాండ్‌ను ఆసరా చేసుకుని.. ప్రైవేట్ కంపెనీలు తమ విత్తనాలకు వివిధ పేర్లు పెట్టి నచ్చిన ధరకు అమ్ముతున్నాయి. విత్తన ధరలపై ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడంతో కంపెనీలు తమ ఉత్పత్తి ధర, లాభాలు చేసుకుంటూ అమ్మకాలు సాగిస్తున్నాయి. రైతులు క్వింటాల్ మొక్కజొన్నలను రూ.1800 నుంచి రూ.2000కు విక్రయిస్తే విత్తన కంపెనీలు మాత్రం కంపెనీ డిమాండ్‌ను బట్టి 4 కిలోల బస్తాను రూ.1500 నుంచి రూ.2500 వరకు విక్రయిస్తున్నాయి. కంపెనీలు గ్రామాల్లో ప్రచారం చేస్తూ.. తమ విత్తనాలను సాగు చేస్తే ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని, మొక్కజొన్న ఆకులు ఎక్కువగా రావడంతో రామచిలుకలు రావని, పంటకు తెగుళ్లు ఆశించవంటూ రైతులకు అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నాయి.

సబ్సిడీ రాక..

మొక్కజొన్న విత్తనాలపై సబ్సిడీ లేకపోవడంతో జిల్లా రైతులకు రూ.4 కోట్ల వరకు నష్టం వాటిల్లుతోంది. సగటున మొక్కజొన్న 4 కిలోల విత్తనాల సంచిని రూ.2000 వరకు కంపెనీలు విక్రయిస్తే.. ఆ సంచిపై 33 శాతం సబ్సిడీ ఉంటే రూ.660 సబ్సిడీ రైతులకు దక్కేది. కేవలం రైతులు సంచికి రూ.1340 చెల్లిస్తే సరిపోయేది. సబ్సిడీ ఎత్తివేయడంతో జిల్లా రైతులపై దాదాపు రూ.4 కోట్ల వరకు అదనపు భారం పడుతుంది.

సబ్సిడీ ఇవ్వాలి



మక్కలకు కనీసం 50 శాతం సబ్సిడీ ఇవ్వాలి. దీనివల్ల రైతులకు కొంతలో కొంత మేలు జరుగుతుంది. నేను ఐదు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తే.. విత్తనాల ఖర్చే రూ.10 వేలు అవుతోంది. సబ్సిడీ ఇస్తే నాలాంటి రైతులకు కొంత ఖర్చు తగ్గుతుంది.

– సత్యనారాయణ రెడ్డి, సారంగాపూర్

ఎలాంటి సబ్సిడీ లేదు



ప్రస్తుతం మొక్కజొన్న విత్తనాలపై ఎలాంటి సబ్సిడీ లేదు. ప్రభుత్వం తరుపున విత్తనాలు అందించడం లేదు. ప్రైవేట్ కంపెనీలు ఓపెన్ మార్కెట్లో మొక్కజొన్న విత్తనాలు అమ్ముకుంటున్నాయి. నమ్మకమైన, నాణ్యమైన సంస్థ నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచిస్తున్నాం. లేకుంటే రైతులు నష్టపోయే ప్రమాదముంది.

– భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి

మడేలేశ్వరస్వామి ఆలయంలో చోరీ

- 15 గ్రాముల బంగారం చోరీ

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని మంచినీళ్ల బావి వద్దగల మడేలేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. పూజ అనంతరం అర్చకులు ఆలయానికి తాళం వేసి వెళ్లారు. గుర్తుతెలియని దొంగలు చొరబడి 15 గ్రాముల బంగారం, హుండీలో కొంత నగదు ఎత్తుకెళ్లారు. ఉదయం అర్చకులు వెళ్లి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ ఎస్సై మన్మథరావు సంఘటన స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

కాల్వశ్రీరాంపూర్: మండలం మల్యాల గ్రామంలో బుధవారం పిచ్చికుక్కల దాడిలో బొట్కు మహేశ యాదవ్‌కు చెందిన 20 గొర్రెలు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

దొంగను పోలీసులకు పట్టించిన రైతులు



పట్టుకున్న దొంగను పోలీసులకు అప్పగిస్తున్న రైతులు

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణ శివారులోని మోతె బైపాస్ రోడ్డులో వ్యవసాయ మోటార్లు, విద్యుత్ వైర్లను ఎత్తుకెళ్తున్న దొంగను రైతులు పట్టుకుని రూరల్ పోలీసులకు అప్పగించారు. జగిత్యాల జిల్లాకేంద్రానికి చెందిన యువకులు ఆదాబ్, సయ్యద్, సాహెబ్ కొద్దికాలంగా మోతె శివారులోని మోటార్లు, విద్యుత్ వైర్లు, స్టార్టర్లు ఎత్తుకెళ్తున్నారు. దీంతో రైతులు నిఘా పెట్టారు. బుధవారం మధ్యాహ్నం సమయంలో ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి కొత్తగా నిర్మిస్తున్న ఇంటి వద్ద సలాకలు, మోటార్ వైర్లు దొంగలించి తీసుకెళ్తుండగా రైతులు వెంటపడ్డారు. ఇద్దరు దొంగలు పారిపోయారు. ఒక దొంగను పట్టుకున్న రైతులు పోలీసులకు అప్పగించారు. ఏడాదికాలంగా దాదాపు 30 నుంచి 40 విద్యుత్ మోటార్లు, స్టార్టర్లు దొంగలు ఎత్తుకెళ్లారని, గతంలో కూడా దొంగలను పోలీసులకు పట్టిస్తే ఎలాంటి చర్యలూ తీసుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

అడగండి... అడుగేయండి



బడిలోకి వెళ్తున్న విద్యార్థులు(ఫైల్)

గంభీరావుపేట(సిరిసిల్ల): ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చేర్పించే ముందు తల్లిదండ్రులు ఆచితూచీ అడుగేయాల్సిన అవసరం ఉంది. ఆ స్కూల్ ఎలాంటిది? గతంలో స్కూల్ విద్యార్థులు సాధించిన ఫలితాలు ఎలా ఉన్నాయి? ఫీజుల వివరాలు, తల్లిదండ్రులతో యాజమాన్యం ఎలా వ్యవహరిస్తుంది? అనే వివరాలు గమనించాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేది పాఠశాలే కాబట్టి.. ఆలోచించి అడుగేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. జిల్లాలో 120 గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. నేటి నుంచి పాఠశాలలు పునర్‌ప్రారంభం కానుండడంతో ఇప్పటికే జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. హంగు ఆర్భాటాలతో విద్యార్థులను చేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఉపాధ్యాయులను ఇళ్లకు పంపిస్తూ పిల్లలను తమ బడిలో చేర్పించాలని కోరుతున్నారు.

అనుమతులు ఉన్నాయా..

ప్రైవేటు పాఠశాల తమ వివరాలను విద్యాశాఖ కార్యాలయంలో నమోదు చేసుకొని ఉంటుంది. వారికి నిర్ధిష్ట సంఖ్య, నమోదైన సంవత్సరంతో కూడిన పత్రాన్ని ఇస్తారు. దీన్ని పరిశీలించాకే తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించాలి. కొన్ని పాఠశాలలు 1–7, 8–10 తరగతుల వరకు నిర్వహిస్తారు. ఈ విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉంది.

నోటీస్ బోర్డుపై ఇవి ఉన్నాయా..?

మీరు చేర్పించబోయే ప్రైవేటు పాఠశాలలోని బోధన సిబ్బంది అర్హతలు ఎలా ఉన్నాయో గమనించాలి. అర్హత గల ఉపాధ్యాయులు ఉన్నారా? అనేది ఆరా తీయాలి. బీఈడీ, డీఈడీ వంటి విద్యార్హతలు గల వారితో విద్యాబోధన చేస్తున్నారో.. లేదో తెలుసుకోవాలి. ఉపాధ్యాయుల వివరాలు, అర్హతలను ప్రభుత్వ పాఠశాలలో మాదిరిగా ప్రైవేటు పాఠశాల నోటీస్ బోర్డుపై ప్రదర్శించారో.. లేదో చూడాలి. ఫీజుల వివరాలు ఎలా ఉన్నాయి? ఫీజుల్లో పారదర్శకత ఉందా.. అడిగి తెలుసుకోవాలి.

వసతులపై దృష్టి పెట్టండి

మెరుగైన ఫలితాలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారో.. లేదో తెలుసుకోవాలి. ప్రాథమిక స్థాయి నుంచి పఠనాసక్తి కలిగించే ఎలాంటి అంశాలు అమలు చేస్తున్నారో అడగాలి. స్కూల్‌లో లైబ్రరీ, ప్లేగ్రౌండ్, టాయిలెట్స్.. తాగునీటి వసతుల గురించి తెలుసుకోవాలి.

ఇన్నోవేటివ్ అంశాలపై..

పాఠశాలలో ఇన్నోవేటివ్ అంశాలు నేర్పిస్తున్నారా.. కొత్త విషయాలను విద్యార్థులకు తెలిసేలా తరగతులు నిర్వహిస్తున్నారా.. తెలుసుకోవాలి. గతంలో వైజ్ఞానిక ప్రదర్శనలు.. ఇన్‌స్పైర్ మానక్, సైన్స్‌మేళాల్లో భాగస్వామ్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని, ప్రతిభ చాటే వారిని ఎలా ప్రోత్సాహం ఎలా ఉందో ఆరా తీయాలి. అలాంటి పాఠశాలలను తల్లిదండ్రులు ఎంపిక చేసుకోవాలి.

ధర్మపురిని రెవెన్యూ డివిజన్‌గా చేస్తా

- 50 పడకల ఆసుపత్రి, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు నిర్మిస్తా
- విద్యార్థినుల ఉన్నత విద్యకు సదుపాయాలు
- ధర్మపురి పుణ్యక్షేత్ర అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్
- ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తా
- 'సాక్షి' ఇంటర్వ్యూలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



సాక్షిప్రతినిధి,కరీంనగర్: తనకు రాజకీయ జన్మనిచ్చిన ధర్మపురిని నియోకవర్గాన్ని, ఇటీవల రోడ్డు ప్రమాదంలో పునర్జన్మనిచ్చిన ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి రుణాన్ని తాను ఏనాడూ తీర్చుకోలేనని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా నియోజకవర్గానికి వచ్చిన ఆయన బుధవారం 'సాక్షి' ఇంటర్వ్యూలో మాట్లాడారు.

నియోజకవర్గపరంగా మీ ప్రాధాన్యాలేంటి?

అడ్లూరి: ధర్మపురి ప్రజలను, లక్ష్మీ నరసింహస్వామిని జీవితంలో మర్చిపోను. ప్రజలు ఎమ్మెల్యేగా జన్మనిస్తే.. రోడ్డు ప్రమాదంలో స్వామి నన్ను కాపాడి పునర్జన్మనిచ్చారు. ఎన్నికల్లో ఎన్నిసార్లు ఓడినా నా అనుచరులు నా కోసమే పనిచేశారు. వారిరుణం ఎన్నటికీ తీర్చుకోలేనిది. మంత్రిగా నియోజకవర్గంలో సాగునీటికి తొలి ప్రాధాన్యం ఇస్తా. విద్య, వైద్యం, సదుపాయాలకు పెద్దపీట వేస్తా. ఇక్కడి విద్యార్థినులు డిగ్రీ, పీజీ కళాశాలలు లేక జగిత్యాల, కరీంనగర్ వెళ్తున్నారు. ధర్మపురిలో డిగ్రీ, పీజీ కళాశాలలతోపాటు ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యాసంస్థలు ఏర్పాటు చేయిస్తా. చారిత్రక ధర్మపురి పుణ్యక్షేత్రానికి చీకటిపడితే రవాణా సౌకర్యం లేదు. ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలి. 50పడకల ఆసుపత్రి నిర్మిస్తా. ధర్మపురిని రెవెన్యూ డివిజన్‌గా మారుస్తా.

మంత్రిగా భవిష్యత్ ప్రణాళికలు?

అడ్లూరి: తొలిసారి ఎమ్మెల్యే, ఆపై విప్.. ఇప్పుడు మంత్రి పదవి. పార్టీలో సామాన్య కార్యకర్తలకు ప్రాధాన్యం ఉంటుందనడానికి నాకు దక్కిన పదవులే నిదర్శనం. మంత్రి అయ్యాక మరింత బాధ్యత పెరిగింది. నాకు ప్రభుత్వం కేటాయించిన ఏ శాఖ కేటాయించినా 100శాతం న్యాయం చేస్తా. ప్రజా ఆకాంక్షల మేరకు పనిచేస్తా. ప్రతీ 30రోజులకు నా శాఖలోని పనులపై సమీక్ష చేపడతా.

మీరు మంత్రి కావడంలో కుటుంబ పాత్ర?

అడ్లూరి: నా భార్య కాంతకుమారి ప్రభుత్వ లెక్చరర్. నా రాజకీయ జీవితంలో ఆమె పాత్ర చాలా కీలకం. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్థికంగా ఇబ్బందులున్నా.. తన ఉద్యోగాన్ని, కెరీర్‌ను త్యాగం చేసి నాకు అండగా నిలిచింది. 2018లో ఓడిన సమయంలో నాలో ధైర్యం నింపింది. నా పిల్లలు కూడా వెంట నిలిచారు. వారి సహకారం మాటల్లో వర్ణించలేనిది.

గొర్రెలకాపరులకు పరిహారం అందిస్తాం

- రాష్ట్రమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- గొర్రెల కాపరుల కుటుంబాలకు పరామర్శ



హమాలీ కుటుంబానికి చెక్కును అందిస్తున్న మంత్రి

ధర్మారం(ధర్మపురి): విద్యుత్ షాక్‌తో మరణించిన గొర్రెలకు పరిహారం అందిస్తామని, బాధితులు ఆందోళన చెందవద్దని మంత్రి లక్ష్మణ్‌కుమార్ భరోసా ఇచ్చారు. చామనపల్లిలో విద్యుదాఘాతంతో 52 గొర్రెలు మరణించగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి గొర్రెలకాపరులను పరామర్శించారు. అనంతరం స్థానిక మార్కెట్ యార్డులో ప్రమాదవశాత్తు లారీపై నుంచి కిందపడి మరణించిన హమాలీ మెడవేని రాజేశం భార్య రాజేశ్వరికి రూ.5లక్షల సాయం చెక్కు అందజేసి మాట్లాడారు. ఇచ్చిన మాటప్రకారం సింగిల్‌విండో ద్వారా రూ.3 లక్షలు, కలెక్టర్ ప్రత్యేక నిధి ద్వారా రూ.2లక్షలను బాధిత కుటుంబానికి అందించామన్నారు. చామనపల్లిలో మృత్యువాతపడ్డ ఒక్కో గొర్రెకు రూ.7వేల చొప్పున విద్యుత్ శాఖ ద్వారా పరిహారం మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ధర్మారం, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్‌పర్సన్లు రూప్లానాయక్, ఈర్ల స్వరూప, వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, మేడారం సింగిల్‌విండో చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ సంతోష్, డీసీవో శ్రీమాల, డీఎంవో ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహం, మాజీ వైస్‌చైర్మన్ కాడే సూర్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అశోద అజయ్, నాయకులు ఓరం చిరంజీవి, ఎండీ అష్మ, ఎల్లయ్య, ఈదుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక శిక్షణ.. భవిష్యత్తుకు నిచ్చెన

- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు
- టైలరింగ్, డ్రాయింగ్, క్రాఫ్ట్, ఆర్ట్‌లలో 42 రోజులపాటు..
- పూర్తి చేసిన 89 మంది పురుషులు, 680 మంది మహిళలు



శిక్షణలో పాల్గొన్న మహిళలు



డ్రాయింగ్, క్రాఫ్ట్ తదితర వాటిల్లో శిక్షణ పొందుతున్న మహిళలు

సప్తగిరికాలనీ(కరీంనగర్): తమ చిన్ననాటి కలలను ఇప్పుడు సాకారం చేసుకుంటున్నామని కొందరు.. నేర్చుకుంటున్న కళను ఇంకా మెరుగుపర్చుకుందామని మరికొందరు.. స్కూల్‌లో పిల్లలకు పెట్టే టాస్క్‌లో మేము సైతం సాయం చేద్దామని ఇంకొందరు.. ఉపాధి కోసమని.. ఉద్యోగం సాధించాలని.. పది మందికి ఉపాధి కల్పించాలని ఇలా ఎవరికి వారు తమ ఆశయాలు, లక్ష్యం సార్థకం చేసుకునేందుకు సిద్ధమయ్యారు నారీమణులు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపిస్తూ కళలకు వయస్సుతో సంబంధం లేదని కరీంనగర్ మంకమ్మతోటలోని ధన్గర్‌వాడీ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న సాంకేతిక ఉపాధ్యాయ శిక్షణ కోర్సు(టీటీసీసీ)లో ఉత్సాహంగా పాల్గొన్నారు మహిళలు. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెక్నికల్ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సులో పెద్ద సంఖ్యలో హాజరై శిక్షణ పొందారు. 42 రోజులపాటు సాగిన కోర్సు బుధవారంతో పూర్తయింది. ఈక్రమంలో శిక్షణ పొందిన మహిళల అనుభవాలు, భవిష్యత్ కార్యాచరణపై సాక్షి ప్రత్యేక కథనం.

42 రోజుల శిక్షణ

ధన్గర్‌వాడీ పాఠశాలలో నిర్వహిస్తున్న టెక్నికల్ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సులో కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కొమురంభీం, మంచిర్యాల, సిద్దిపేట, నిర్మల్ జిల్లాల నుంచి 89 మంది పురుషులు, 680 మంది మహిళలు మొత్తం 769 మంది వివిధ కోర్సుల్లో శిక్షణ పొందారు. మే 1న కోర్సు ప్రారంభించగా.. జూన్ 11తో ముగిసింది. టైలరింగ్, డ్రాయింగ్, ఆర్ట్, క్రాఫ్ట్‌లలో 42 రోజులపాటు శిక్షణ పొందారు. 469 మంది డ్రాయింగ్‌లో, 360 మంది టైలరింగ్, క్రాఫ్ట్‌లలో శిక్షణ తీసుకున్నారు. శిక్షణ కోర్సు డైరెక్టర్ బొట్ల రామస్వామి పర్యవేక్షణలో టీటీసీసీ శిక్షణ కార్యక్రమాలు పకడ్బందీగా పూర్తయ్యాయి.

ఆర్ట్‌లో నైపుణ్యం సాధించా



ఎంటెక్ పూర్తి చేశా. ప్రస్తుతం జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నా. ఆర్ట్, డ్రాయింగ్ అంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. కోర్సులో భాగంగా చాలా రకాల వాటిని తయారు చేశా. కలెక్టర్ కూడా ఇంప్రెస్ అయ్యారు.

– హెచ్.రోజా, కరీంనగర్

క్రాఫ్ట్ వర్క్ నేర్చుకున్నా



కరీంనగర్‌లో జరిగిన టీటీసీసీలో ప్రతిరోజు క్లాసులకు హాజరయ్యా. క్రాఫ్ట్ వర్క్ బాగా నేర్చుకున్నా. పూల బుట్టి, ఆకులతో పలు రకాల వస్తువులు తయారు చేశా. బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశా. ఇలాంటి కోర్సులు మాకు ఉపాధినిచ్చే విధంగా ఉన్నాయి. ప్రతీ ఒక్కరు కోర్సు చేయాలి.

– ఎల్.లక్ష్మి, ఇందారం, మంచిర్యాల

టైలరింగ్‌లో శిక్షణ..



బీకామ్ డిగ్రీ చేశా. గతంలో శిశు గృహ తదితర సంస్థల్లో పని చేశా. కోర్సు పూర్తి చేసి స్కూళ్లలో చిన్నారులకు నేర్పించాలనుకుంటున్నా. టైలరింగ్‌లో అల్లికలు తదితర వాటిని బాగా నేర్చుకున్నా. ట్రైనర్స్ బాగా చెప్పారు. ప్రతీ ఒక్కరికి ఉపయోగపడే శిక్షణ ఇది.

– ఇ.సంధ్య, గాలిపెల్లి, సిరిసిల్ల

ఉత్సాహంగా హాజరు



2016 నుంచి టీటీసీసీలో టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నా. ప్రతిరోజు సుమారు 700 మందికి పైగా హాజరవుతున్నారు. ప్రస్తుతం కరీంనగర్ డాక్టర్ స్ట్రీట్‌లోని బాలికల పాఠశాలలో పని చేస్తున్నా. శిక్షణ కోర్సుల్లో చాలా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. చాలామందికి ఉపయోగపడే కోర్సు ఇది. ప్రతి సంవత్సరం శిక్షణకు వచ్చే వారి సంఖ్య పెరుగుతుండడం విశేషం.

– కె.సుజాత, టైలరింగ్ ట్రైనర్

విజయవంతంగా పూర్తి



కరీంనర్ వేదికగా 42 రోజులపాటు విజయవంతంగా కోర్సు జరిగింది. పెద్ద సంఖ్యలో పురుషులు, మహిళలు హాజరయ్యారు. కోర్సులో భాగంగా పలువురు మహిళలు అద్భుతాలను సృష్టించేవిధంగా వస్తువులను తయారు చేసి అలరించారు. కోర్సు చేసిన పాఠశాల వాతవరణాన్ని పూర్తిగా మార్చేశారు. సొంతంగా పాఠశాల గోడలకు అద్భుతమైన చిత్రాలను వేశారు. ఎందరికో ఉపాధినిచ్చే ఇలాంటి కోర్సులను ప్రతీ ఒక్కరు పూర్తి చేయాలి.

– బొట్ల రామస్వామి, కోర్సు డైరెక్టర్